రైతులందరికీ భరోసా



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటపెట్టుబడి సాయంగా అందించనున్న 'రైతు భరోసా' పథకం నిధులను సోమవారం నుంచి రైతుల ఖాతాలలో జమ చేస్తోంది. రెండు పంటలకు కలిపి ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు అందించనున్న ఈ నిధులను తొమ్మిది రోజుల్లో రైతులందరి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో 2 ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ ఎకరాకు ఆరువేల చొప్పున నిధులను జమ చేస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా వేస్తుండటంతో రైతులకు పెట్టుబడికి సరైన సమయానికి ఇస్తున్నారని సంబురపడుతున్నారు. కొన్ని కారణాల వల్ల కొంతమంది రైతులకు ఈ నిధులు జమకాకపోవడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- రైతుల ఖాతాల్లో జమ అవుతున్న పెట్టుబడి సాయం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన ప్రక్రియ
- ఎకరాలతో నిమిత్తం లేకుండా అందనున్న రైతు భరోసా

నాగర్‌కర్నూల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్రమంగా చక్కదిద్దుతున్న ప్రభుత్వం రైతు భరోసా' పథకం కింద నిధులను వారి ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించింది. తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల రైతుభరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రకటించిన నేపథ్యంలో 2 ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ ఎకరాకు ఆరువేల చొప్పున జమ చేస్తున్నారు. సకాలంలో రైతు భరోసా వేస్తుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగో సారి రైతు భరోసా నిధులు విడుదలవుతున్నాయి. మధ్యలో రైతు రుణమాఫీకి నిధులను భారీగా కేటాయించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా అంశాన్ని జాప్యం చేయడంతో అన్నదాతల్లో ఆవేదన వ్యక్తమైంది. జూన్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడుతుందని వస్తున్న ఊహగానాల నేపథ్యంలో రైతు భరోసాకు సంబంధించిన నిధులు విడుదల కావడం గమనార్హం.

ఎన్ని ఎకరాలు ఉన్నా 'భరోసా'

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో రైతు భరోసాకు సంబంధించిన అంశంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. సాగుయోగ్యం కాని భూమికి కూడా రైతుబంధును అమలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో సర్వే జరిపించింది. ఉదాహరణకు ఒక సర్వే నెంబరులో నీటి లభ్యత ఆధారంగా ఎకరాలో పంటను సాగు చేసి రెండెకరాలు బీడుగా పెట్టుకున్న రైతుల జాబితాను సర్వేలో చేర్చడంతో వారికి రైతు భరోసా పథకం పాక్షికంగా అమలైంది. ఇప్పటికీ అలాంటి సర్వే నెంబర్లు రైతు భరోసా అమలుకు యోగ్యత లేకుండాపోయాయి. రైతుభరోసా నిధుల విడుదల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైనప్పటికీ చిన్న, సన్నకారు రైతులకు సంబంధించి అనేక మంది పేర్లు జాబితాలో లేకపోవడం పట్ల అన్నదాతల్లో అసహనం వ్యక్తమవుతోంది.



ఉమ్మడి జిల్లాలో వివరాలు..

రైతుభరోసా పథకం కింద నాగర్‌కర్నూల్ జిల్లాలో 3,34,835మంది రైతులను అర్హులుగా గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 8,62,617 ఎకరాల భూమి సాగుయోగ్యంగా ఉంది. రెండెకరాలలోపు భూమి ఉన్న రైతులు 1,83,972 మంది ఉన్నట్లు

- మిగతా 6లో..

తీగ పందిరి పంటలతో అధిక లాభాలు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మద్దెల్‌బీడ్‌లో తీగ జాతి కూరగాయ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

దామరగిద్ద, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూర గాయలు సాగుతో చాలా లాభాలు వస్తాయని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం కలెక్టర్ దామరగిద్ద మండల పరిధిలోని మద్దెలబిడ్ గ్రామ శివారులో శంకర్ అనే రైతు తన పొలంలో తీగపందిరి పద్ధతిలో సాగు చేసిన కాకరకాయ, సోర, టమోట పంటలను పరిశీలించారు. రైతులకు ఇంకా మెరుగైన పంటలకు ప్రభుత్వం తరఫున నుంచి హనిబాక్స్‌లపై అవగాహన కల్పించి రైతులకు అందిస్తామన్నారు. అనంతరం గత్ప గ్రామంలో నిర్వహిస్తున్న భూభారతి రైతు సదస్సు కేంద్రాన్ని పరిశీలించారు. ఎలాంటి ఫిర్యాదులు అందాయి? వచ్చిన వాటిని పరిశీలించి నోటీసు ఇవ్వాలని, 7 రోజుల్లో వాటిని పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని మంజూరయ్యాయి... అందులో గ్రౌండింగ్ ఎంత అయిందని అధికారులను అడిగి తెలుసు కున్నారు. దామరగిద్ద కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాఠశాల ప్రారంభమై నాలుగు రోజులు అవుతున్నా రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కానుకుర్తి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ యోగాడే సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయుష్ హెల్త్ అండ్ వెల్నెస్ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల 21వ తేదీన యోగా డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఎంపీడీవో సాయిలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి ఆహ్వానం

- గవర్నర్‌ను కోరిన పీయూ అధికారులు



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ అధికారులు మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆయనను వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు కలిసి మాట్లాడారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు.

రూ.443 కోట్ల డిపాజిట్లు



- రైతులకు రూ.468కోట్ల రుణాలు అందజేత
- డీసీసీబీ చైర్మన్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి

మహాజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి

7

వైభవంగా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు



మరికల్ మండలం తీలేరు గ్రామంలో జర్గిందె ఊరేగింపులో భక్తులు

7

'కోల్డ్' వంచన



- నిల్వ చేసుకున్న మిర్చి లేదంటూ బుకాయింపు
- కోల్డ్ స్టోరేజీ చుట్టూ వ్యాపారి ప్రదక్షిణలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- సోదా చేసి మిర్చి బస్తాల వెలికితీత

కోల్డ్‌స్టోరేజీ ముందు బైఠాయించిన బాధిత కుటుంబం

6

అధ్యాపకుల కొరత

- పేట ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిస్థితి
- వచ్చేందుకు ఆసక్తి చూపని ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- 95 పోస్టులకు 38 మంది మాత్రమే విధుల్లో..
- 57 పోస్టుల ఖాళీలు
- జిల్లా ఆసుపత్రి భవనంలోనే మెడికల్ కాలేజీ కొనసాగింపు



పేట ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం

నారాయణపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పాటు పలు వసతులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్, సోషల్ అండ్ ప్రివెంటివ్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు ప్రొఫెసర్లు లేరు. హైదరాబాద్‌కు నారాయణపేట 171 కిలోమీటర్ల దూరం కావడంతో పాటు హెచ్‌ఆర్‌ఏ స్థానికంగా తగ్గుతుండటం వల్ల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. సిబ్బంది కొరతపై జాతీయ వైద్య మండలి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సిబ్బంది కొరతతో పాటు ఆపరేషన్ థియేటర్లు లేవనే లోపాలను గుర్తించి షోకాజు నోటీస్ జారీ చేసింది. పేట మెడికల్ కాలేజీలో 95 పోస్టులకు 38 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 57 ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఉన్న 38 మంది సిబ్బందితోనే కళాశాలను నెట్టుకొస్తున్నారు. ఆపరేషన్ థియేటర్ల కొరత ఉంది. రెండు మృతదేహాలు పరీక్షల నిమిత్తం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. 2024- 25 సంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సరంలో 50 మంది విద్యార్థులు కౌన్సెలింగ్ ద్వారా రావడంతో ఎంబీబీఎస్ చదువులతో తొలి ఏడాది ప్రభుత్వ మెడికల్ కాలేజీ (గత ఏడాది) ప్రారంభమైంది. అలాగే రెండేళ్ల పాటు డిప్లొమా కోర్సులు డయాలసిస్, ఈసీజీలలో 60 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.66.48 కోట్ల వయ్యంతో నారాయణపేట మండలం అప్పక్‌పల్లి దగ్గర జిల్లా ఆసుపత్రి భవన సముదాయాన్ని నిర్మించగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ఈ సముదాయం రెండో అంతస్తులో మెడికల్ కాలేజీ నిర్వహిస్తుండగా కింది పైఅంతస్తుల్లో జిల్లా ఆసుపత్రి కొనసాగుతున్నది. గత ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెడికల్ కళాశాల విద్యార్థులతో సమావేశమైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రూ. 26 కోట్ల వ్యయంతో నర్సింగ్ కళాశాల భవనానికి, రూ.40 కోట్లతో మాతా శిశు సంక్షేమ సంరక్షణ భవనానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఆ రెండింటి పనులు ప్రగతిలో ఉన్నాయి. అయితే, రూ.130 కోట్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసినా ఇంకా టెండర్లు పిలవాల్సి ఉంది.

మంత్రి పదవిని బాధ్యతతో నిర్వర్తిస్తా

- హంగూ.. ఆర్భాటాల్లేకుండా పాలమూరు అభివృద్ధికి కృషి
- రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



గజమాలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

మహబూబ్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తనపై ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద బాధ్యతలను అప్పగించిందని, దానిని బాధ్యతతో నిర్వర్తిస్తానని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తానని, చివరి వరుసలో ఉన్న లబ్ధిదారుడికి కూడా సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయడమే తన కర్తవ్యమని చెప్పారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన మొదటిసారి మహబూబ్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, ముదిరాజ్ సోదరులు ఘన స్వాగతం పలికారు. ముందుగా పద్మావతి కాలనీలోని పండగ సాయన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడినుంచి ర్యాలీగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్దకు చేరుకుని అక్కడ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి అమరుల స్తూపానికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అభిమానులు గజ మాలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు ఈ రోజు మంచి అవకాశాన్ని పార్టీ కల్పించిందని తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆయనకు ఇచ్చిన శాఖలు కూడా జిల్లాలో మెజారిటీ వర్గాలైన ముదిరాజ్, యాదవ సోదరులకు సంబంధించిన పశుసంవర్ధక, మత్స్య శాఖలను అప్పగించడం జరిగిందన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సహచర ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు, నాయకులు మంత్రిని ఘనంగా సత్కరించారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదు ల్లా కొత్వాల్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్, సీజె బెనహర్, అనిత, సిరాజ్ ఖాద్రి, జహీర్‌అక్తర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలు గౌరవంగా జీవించేలా చేస్తాం

మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలుచేస్తోందని, రాష్ట్రంలో మహిళలు గౌరవంగా జీవించడమే లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రతీ పథకం మహిళల పేరునే అమలుచేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో నైపుణ్య అభివృద్ధి కేంద్రం, సెట్విన్ ద్వారా స్వల్పకాల కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువజన శాఖ పరిధిలో సెట్విన్ ద్వారా మహబూబ్‌నగర్‌లో మహిళల కోసం చేపట్టిన శిక్షణ కార్యక్రమాలను పైలట్‌గా తీసుకొని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు.

గృహహింస కేసులో వ్యక్తికి జైలు శిక్ష

7

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

6

రాష్ట్రంలో మూడు సహకార శిక్షణ కేంద్రాలు మంజూరు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

7

జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు స్థిరంగా వరద

6

కస్తూర్బా విద్యాలయాలకు మహర్దశ

- బాలికలకు సకల సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- జిల్లాలోని 11 కస్తూర్బాలకు సర్వశిక్ష అభియాన్ నిధులు మంజూరు

నారాయణపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని పదకొండు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)కు మహర్దశ పట్టనుంది. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా ప్రభుత్వం రూ. లక్షలు విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా రూ.205 లక్షల నిధులు అవసరం ఉన్నట్లు గుర్తించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, మొదటి విడతలో రూ.98 లక్షల 81 వేల నిధులు విడుదల చేసింది. మిగతా నిధులు రెండో విడతలో రానున్నాయి. ఈ నిధులతో విద్యాలయాల భవనాలు, తరగతి గదులకు రంగులు వేయించి సుందరీకరించనున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ అనుమతి పొంది జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద్‌రాజులు, జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, తెలంగాణ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీయర్ల పర్యవేక్షణలో పనులు ఈ నెలాఖరులోపు చేసేలా చర్యలు తీసుకో నున్నారు. తరగతి గదులకు రంగులు వేయడంతో పాటు సౌర విద్యుత్‌తో నీరు కాచుకొనేందుకు యంత్రాల ఏర్పాటు, విద్యుత్ మరమ్మతులు, శుద్ధజల ప్లాంట్ల ఏర్పాటు, బోర్లు వేయించడం, కిచెన్ షెడ్లు, స్నానాల గదులు, పడక హాళ్ల నిర్మాణం వంటివి చేప ట్టారు. మాగనూర్ కస్తూర్బా ఈసారి కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. పిల్లలకు పడక హాలు నిర్మించనున్నారు.



మరికల్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయం

కస్తూర్బా పాఠశాల	ప్రతిపాదించిన నిధులు	మంజూరైన నిధులు
ఊట్కూర్	19 లక్షలు	9.158 లక్షలు
దామరగిద్ద	22 లక్షలు	10.604 లక్షలు
ధన్వాడ	19 లక్షలు	9.158 లక్షలు
కోస్గి	14 లక్షలు	6.748 లక్షలు
క్రిష్ణా	11 లక్షలు	5.302 లక్షలు
మద్దూర్	16 లక్షలు	7.712 లక్షలు
మాగనూర్	56 లక్షలు	26.992 లక్షలు
మక్తల్	13 లక్షలు	6.266 లక్షలు
మరికల్	11 లక్షలు	5.302 లక్షలు
నారాయణపేట	8 లక్షలు	3.856 లక్షలు
నర్వ	16 లక్షలు	7.712 లక్షలు
మొత్తం	205 లక్షలు	98.810లక్షలు

జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు స్థిరంగా వరద

ధరూరు/దోమలపెంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరదనీటి రాక కొనసాగుతోంది. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతున్నట్లు జూరాల అధికారులు తెలిపారు. ఎగువన కురిసిన వర్షాల కారణంగా దిగువ ప్రాజెక్టులకు స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలో 66.95 టీఎంసీల నీరు ఉండగా విద్యుత్ ఉత్పాదన కోసం 15 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయంలో 29.91 టీఎంసీల నీరు ఉండగా 14,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రెండు గేట్లను తెరిచి 16,059 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న జూరాల జలాశయానికి విడుదల చేస్తున్నారు. అందులో ఆరువేల క్యూసెక్కుల నీరు విద్యుత్ ఉత్పత్తికి వాడుతున్నారు. జూరాల జలాశయంలో 317.690 మీటర్లలో 8.010 టీఎంసీ నీటి నిల్వ ఉన్నది. 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, జెన్‌కో జలవిద్యుత్ కేంద్రానికి 20,763 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూడు యూనిట్ల ద్వారా 28.525 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315 క్యూసెక్కులతో మొత్తం 22,645 క్యూసెక్కుల టిని నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పాదన నుంచి 20,763 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 4,412 క్యూసెక్కులతో మొత్తం 25,175 క్యూసెక్కుల నీరు వస్తుండగా 39,675 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 844.20 అడుగులలో 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 68.5660 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. ఎంజీకేఎల్ఐ కాల్వకు 1,326 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో 8,714 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 3.990 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

60 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

» జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్



విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోకి వెళ్తున్న వరద

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఇప్పటివరకు 60 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఎగువ జల విద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా 3.381, దిగువ జల విద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా 3.816 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. సాయంత్రం నాటికి ఎగువ నుంచి 20 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. వరద ఉధృతి పెరిగితే మరికొన్ని యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని తెలిపారు.

రైతులందరికీ 'భరోసా'



వ్యవసాయ పొలం దున్నుతున్న రైతు

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. ఐదెకరాల పైబడి వ్యవసాయ భూములు ఉన్న రైతుల సంఖ్య 24,711మంది ఉన్నారు. రైతు భరోసా పథకం కింద జిల్లాకు 9 రోజుల్లో దాదాపు రూ.429.314కోట్లు రైతుల ఖాతాలలో జమ కానున్నాయి. నారాయణపేట జిల్లాలో రైతు భరోసా పథకానికి 1,78,017మంది రైతులు అర్హులు కాగా మంగళవారం మధ్యాహ్నం వరకు రెండెకరాలలోపు భూమి ఉన్న రైతులకు రూ.60.50 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లాకు రైతు భరోసా పథకం కింద మొత్తం రూ.257.84కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండెకరాలలోపు రైతులు 1,03,269 మంది ఉన్నారు. రెండెకరాలకు ఆపై ఉన్న రైతులు 50,125మంది ఉన్నారు. రైతు భరోసా కింద రూ.279కోట్లు జమ కావాల్సి ఉంది. రెండెకరాలలోపు ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసినప్పటికీ ఇప్పటి వరకు ట్రెజరరీలో మాత్రమే జమ అయింది. ఖాతాలో జమ అయిన డబ్బుల సంఖ్య జిల్లా లాగిన్‌లో జీరోగా చూపిస్తోంది.

మహబూబ్‌నగర్ జిల్లాలో 2,54,059 మంది రైతులు ఉన్నారు. 4,58,293 ఎకరాల సాగుయోగ్యమైన భూమి ఉంది. ఈ జిల్లాలో 1,98,166 మంది చిన్న సన్న కారు రైతులు ఉన్నారు. వీరికి రైతు భరోసా కింద రూ.255.48 కోట్లు జమ కావాల్సి ఉంది. రైతుల ఖాతాలో ఇవన్నీ కూడా ఇప్పటి వరకు అప్‌డేట్ కాలేదు.

ఎకరా బీడు ఉండడంతో నిలిచిన రైతు భరోసా



మూడు ఎకరాల భూమిలో ప్రతీ సంవత్సరం సాగు చేస్తున్నప్పటికీ గత యాసంగిలో ఒక ఎకరా భూమిని బీడుగా ఉంచాను. దీంతో ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా సాగు చేస్తున్న భూమికి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం చెబుతున్న విధంగా క్షేత్రస్థాయిలో మాత్రం సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి వర్షాకాలంలో నైనా రైతు భరోసా అందేవిధంగా చూడాలి.

\- వెంకటయ్య, సిర్సవాడ గ్రామం



యాసంగి రైతు భరోసా రాలేదు

గత యాసంగిలో ఆరు ఎకరాల 23గుంటల భూమి సాగు చేసినప్పటికీ ప్రభుత్వం అందించే రైతు భరోసా నిధులు అందలేదు. అధికారులు కనీసం ఈ ఏడాదైనా వచ్చేలా చూడాలి.

\- శంకర్‌గౌడ్, ఎట్టిధర్‌పల్లి గ్రామ రైతు

బావిలో పడి మహిళ మృతి



సరస్వతి (ఫైల్)

మల్దకల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, మద్దలబండ గ్రామానికి చెందిన నవారన్న, సరస్వతి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం సరస్వతి పొలం పనులను ముగించుకొని, కాళ్లు కడుక్కోవడానికి బావి వద్దకు వెళ్లింది. కాళ్లు కడుక్కుంటూ ప్రమాదవశాత్తు జారిలో బావిలో పడి మృతి చెందింది.

ఎప్పటికి పూర్తయ్యేను?

» వనపర్తి జిల్లాకు 12 విద్యుత్ సబ్‌స్టేషన్లు

» ముందుకు సాగని నిర్మాణ పనులు

» లో ఓల్టేజీతో రైతులకు ఇబ్బంది



పెబ్బేరు మండలం తోమాలపల్లెలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్

పెబ్బేరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. 2019లో మొదలైన పనులు కూడా ఇప్పటికీ పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపమే అందుకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో వ్యవసాయ పంటల సాగు నీరందించే విద్యుత్ మోటార్లకు లో ఓల్టేజీ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం వనపర్తి జిల్లాకు 2019 నుంచి 2023 వరకు మొత్తం 12 (33/11కేవీ) విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేసింది. సంబంధిత అధికారులు నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. సాధారణంగా ఈ పనిలో ఒకటి, రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు పూర్తి కాలేదు. కొన్ని చోట్ల 33/11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కానీ భవనాలు, ప్రహరీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు పనులను అసంపూర్తిగా వదిలేసి వెళ్లిపోయారు. దీంతో వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు.

కొన్ని గ్రామాల్లో తమ పొలాల్లో స్తంభాలను పాతకుండా రైతులు అడ్డుకోవడంతో నిలిచిపోయాయి. ఇలా ఒక్కో చోట ఒక్కో సమస్య తలెత్తుతుండటంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో లోటేజీ సమస్యతో మోటార్లు నడవకపోవడం, కాలిపోవడం తదితర సమస్యలతో రైతులు సతమతం అవుతున్నారు. సమస్యను పరిష్కరించాలంటూ రైతులు ఆందోళనలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

రెండు, మూడు నెలల్లో పూర్తి

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. రెండు, మూడు నెలల్లో పనులను పూర్తి చేస్తాం. పనులను అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్లను తొలగించాం. కొన్ని చోట్ల రైతులు సహకరించడం లేదు. సామగ్రి పూర్తి స్థాయిలో లేకపోవడంతో కొంత జాప్యం జరుగుతోంది. నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న సబ్‌స్టేషన్లను పూర్తి చేసి, ప్రారంభిస్తాం.

\- రాజశేఖరం, ఎస్ఈ, టీజీ ఎస్పీడీసీఎల్, వనపర్తి

క్షేత్ర స్థాయిలో పనులు ఇలా..

- పెబ్బేరు మండలంలోని తోమాలపల్లె శివారులో 2019లో ప్రారంభమైన సబ్‌స్టేషన్ నిర్మాణం నేటికి పూర్తి కాలేదు. కొందరు వ్యాపారులు స్తంభాలను పాతకుండా అడ్డుకోవడంలో నాటెల్లి నుంచి వచ్చే 33/11 కేవీ లైన్ ఏర్పాటు నిలిచిపోయింది.
- వనపర్తి కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన విద్యుత్తు ఉపకేంద్రం పనులు చివరి దశకు చేరుకున్నాయి. మిగిలిన పనుల్లో జాప్యం జరుగుతోంది. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న 33 కేవీ లైన్ నిర్మాణ పనులకు పురపాలక శాఖ అనుమతులు లేక పోవడంతో నిలిచిపోయాయి.
- చిన్నంబావి మండలంలోని వెల్టూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించినా, నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపటలేదు.
- వీపనగండ్ల మండలంలోని రంగవరం గ్రామంలో టాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించినా, పనులు మొదలు కాలేదు. గోవర్ధనగిరి గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరైనా, స్థలాన్ని గుర్తించలేదు.
- పెద్దమందడి మండలంలోని అమ్మాయిపల్లిలో స్థల పరిశీలన పూర్తయినా, పనులు ప్రారంభం కాలేదు. మంగంపల్లి వద్ద శిలాఫలకం ఏర్పాటు చేశారు కానీ స్థలం సరిపోకపోవడంతో పనులు చేపట్టడంలేదు.
- రేవల్లి మడంలంలోని తల్పునూర్‌లో లైన్ నిర్మాణం కొనసాగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.
- గోపాల్‌పేట్ మండలంలోని ఏదుట్ల గ్రామంలో పనులు చివరి దశకు చేరుకున్నాయి. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు కొన్ని పనులు పూర్తి కావాల్సి ఉంది.
- కొత్తకోట మండలంలోని పాంపురం గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రహరీ నిర్మించాల్సి ఉంది.
- మదనాపురం మండలంలోని బాలకిష్టాపురం వద్ద పనులు పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. కొంత మేర పనులు మిగిలిపోయాయి. కొన్నూర్‌లో విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి.

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలుర జట్టు ఎంపికలను ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లా మినహా పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు పాల్గొనొచ్చని పేర్కొన్నారు. 2020, జనవరి 1 నుంచి 2011, డిసెంబర్ 31 మధ్య పుట్టిన వారు ఎంపికలకు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 28 నుంచి జూలై 1వ తేదీ వరకు నిజామాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. అర్హత గల వారు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, 2 పాస్ పోర్టు సైజ్ పోటోతో ఉదయం 8 గంటలకు జిల్లా స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

లూజు పత్తి విత్తనాలు పట్టివేత



అయిజలో అధికారుల అదుపులో లూజు పత్తి విత్తనాలు

అయిజ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని కేశవరం గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు దాడులు చేసి లూజు పత్తి విత్తనాలన స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి జనార్ధన్‌లు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్ ఇంట్లో నిల్వ ఉంచిన 4 సంచుల లూజు పత్తి విత్తనాలను గుర్తించారు. వాటి విలువ దాదాపు రూ.1,80,000 ఉంటుందని అధికారులు తెలిపారు. విత్తనాలతో పాటు కాంటాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'కోల్డ్' వంచన

» నిల్వ చేసుకున్న మిర్చి లేదంటూ బుకాయింపు

» కోల్డ్ స్టోరేజీ చుట్టూ వ్యాపారి ప్రదక్షిణలు

» పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

» సోదా చేసి మిర్చి బస్తాల వెలికితీత



మేనేజర్‌ను ప్రాధేయపడుతున్న బాధిత కుటుంబం



గోదాంలో దాచిన మిర్చి బస్తాలను గుర్తిస్తున్న ఎస్సై మురళి

అలంపూరుచౌరస్తా, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తాను నిల్వ చేసుకున్న మిర్చి బస్తాలు లేవంటూ కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు ఓ వ్యాపారిని మోసం చేసేందుకు యత్నించారు. వారి చుట్టూ పలుమార్లు తిరిగి వేసారిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వారు వచ్చి గోదాంలో సోదాలు నిర్వహించి బస్తాలను గుర్తించారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2023లో జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలం, వేముల గ్రామ శివారులోని ఓ కోల్డ్‌స్టోరేజీలో సమీప గ్రామాల రైతులు తాము పండించిన మిర్చిని నిల్వ ఉంచుకున్నారు. అదే ఏడాది మార్చిలో కర్నూలు నగరానికి చెందిన రసూల్‌మియ్య అనే వ్యాపారి కోదండాపురం, మునగాల, నీలిపల్లి గ్రామాలకు చెందిన నలుగురు రైతుల నుంచి 449 బస్తాల 2043 బ్యాడిగి రకాన్ని క్వింటాలుకు రూ.46వేల చొప్పున కొనుగోలు చేశాడు. కానీ ధరలు పడిపోవడంతో అదే గోదాంలో నిల్వ ఉంచుకున్నాడు.

40 రోజుల క్రితం అక్కడికి వచ్చిన రసూల్ మియ్య తన మిర్చి బస్తాలను చూపించాలని కోల్డ్ స్టోరేజీ మేనేజర్‌ను కోరగా బస్తాలు లేవని తెలిపాడు. ఏమైన ఉంటే తమ యజమానిని అడగాలన్నాడు. దీంతో ఆ వ్యాపారి యజమానులన సంప్రదించినా వారు స్పదించలేదు. దీంతో బాధితుడు కోదండపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనపై విచారణ కోసం ఎస్ఐ మురళి మంగళవారం గోదాం వద్దకు చేరుకున్నారు. కానీ ఎఫ్ఐఆర్ కాపీ ఏదంటూ మేనేజర్ ప్రశ్నించడంతో వెనుతిరిగి వెళ్లిపోయాడు. దీంతో వ్యాపారి భార్య, ఇద్దరు పిల్లలతో అక్కడికి చేరుకున్నది. తమ బస్తాలను చూపించాలని రోదిస్తూ మేనేజర్‌ను వేడుకున్నా స్పందించలేదు. దీంతో ఆ వ్యాపారి పురుగుల మందు తాగేందుకు యత్నించడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మురళి 91 సీఆర్‌పీ కింద నోటీసులు జారీ చేసి, తన సిబ్బందితో రంగంలోకి దిగారు. గోదాంలో సోదా చేసి దాచిపెట్టిన బస్తాలను బయటకు తీశారు. ఈ సందర్భంగా వ్యాపారి రసూల్‌మియ్య మాట్లాడుతూ క్వింటాలు రూ. 46 వేలకు మిర్చిని కొన్నానని, కానీ ధర రూ. 10 వేలకు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని తెలిపాడు. దీంతో వ్యాపారం మానేసి కారు నడుపుకుంటూ జీవిస్తున్నానని వాపోయాడు. నష్టానికైనా అమ్ముకుందామని అడిగితే బస్తాలు లేవంటూ వేధించారని తెలిపాడు. చివరి ప్రయత్నంగా ఎస్ఐ మురళిని సంప్రదించడంతో తనకు న్యాయం జరిగిందన్నాడు.

పేకాట స్థావరాలపై దాడులు

అయిజ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరాలపై దాడులు చేసి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాత్రి అయిజ మండల పరిధిలోని మేడికొండ గ్రామంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది.

దీంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.12,800, 4 మొబైల్ ఫోన్లు, 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

జేఎస్ డ్యాన్స్ అకాడమీకి అరుదైన గుర్తింపు

» వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ కో ఆర్డినేటర్ బి.నరేందర్‌గౌడ్



వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ అవార్డు అందిస్తున్న నరేందర్‌గౌడ్, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, అధికారులు

కల్వకుర్తి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి జేఎస్ డ్యాన్స్ స్టూడియో అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థుల ప్రదర్శన అద్భుతంగా ఉందని వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ కో ఆర్డినేటర్ బి.నరేందర్‌గౌడ్, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్‌లు అన్నారు. 24పాటలకు 38 నిమిషాల్లో ఆపకుండా డ్యాన్స్ చేసి వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌లో స్థానం దక్కించుకోవడంతో చిన్నారులకు సర్టిఫికెటను, మెమెంటోలను వారు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని వారు కోరారు. జేఎస్ డ్యాన్స్ స్టూడియో అకాడమీ నిర్వాహకులు శేఖర్ పిల్లలను అద్భుతంగా తీర్చిదిద్దారని పలువురు అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్రహీం, కమీషనర్ మహమ్మద్ షేక్, లయన్స్‌క్లబ్ నేత నటరాజ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల రాములు, మాజీ సర్పంచ్ దామోదర్‌గౌడ్, డాక్టర్ యశోదబాయి, డాక్టర్ నాగరాజు, జాగృతి నాయకులు గణేష్ ఉన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

నేరాల నిరోధానికే కమ్యూనిటీ కాంటాక్ట్

» డీఎస్పీ వెంకటేశ్వర్లు



పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వనపర్తి రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌లో ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సీఐ కృష్ణ ఆధ్వర్యంలో చేట్టిన కమ్యూనిటీ కాంటాక్ట్‌లో 11 మంది ఎస్ఐలు, 69 మంది పోలీసు అధికారులు పాల్గొని, దాదాపు 200 ఇళ్లకు పైగా తనిఖీలు చేపట్టారు. పత్రాలు సరిగా లేని, నెంబర్ ప్లేట్ లేని 40 ద్విచక్ర వాహనాలు అదుపులోకి తీసుకుని, సీజ్ చేసి వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిరు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి, ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుసుకునేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టినట్లు తెలిపారు. వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, మహిళా కానిస్టేబుల్స్, హోంగార్డులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'వెన్నెల' సాహసం

» సైకిల్ యాత్ర చేపట్టిన కామారెడ్డి జిల్లా యువతి

» హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యంపై ప్రచారం

» ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం

» మంగళవారం అలంపూర్ జోగుళాంబ దర్శనం



లేపాక్షి హోటల్ వద్ద సైకిల్ యాత్ర యువతి

అలంపూరు చౌరస్తా, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి, కోలుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె తీవ్ర ఆవేదనకు గురయ్యింది. అలా ఇంకెవరూ చనిపోకూడదని భావించింది. హెల్మెట్, సీట్‌బెల్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నది. అందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా, సోమారంపేట గ్రామానికి చెందిన భానోత్ మోహన్, బూలీ దంపతుల కుమార్తె వెన్నెల ఇంటర్మీడియట్ చదువుతుండగా ఆమె తండ్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కోలుకోలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యింది. ఇలా మరో కుటుంబం నష్టపోకూడదని భావించింది. హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హైదరాబాదు నుంచి ఈ నెల 14 సైకిల్ యాత్రను ప్రారంభించింది. మహబూబ్‌నగర్, వనపర్తి, కొత్తకోట మీదుగా మంగళవారం అలంపూర్‌కు చేరుకున్నది. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకొని పుల్లూరు టోల్‌ప్లాజా వద్దనున్న లేపాక్షి రెస్టారెంట్‌లో ఆమె సేద తీరింది. విషయం తెలుసుకున్న హోటల్ యజమాని భాస్కర్‌రెడ్డి, భైరాపురం మాజీ సర్పంచు బీవీ రమణ ఆమెతో మాట్లాడారు. రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. వెన్నెల ప్రయత్నం అద్భుతమని, ఆమె చేపట్టిన సైకిల్‌యాత్ర ఆడపిల్లల్లో ధైర్యాన్ని నింపుతుందని కొనియాడారు..

క్రైం కార్నర్

విద్యార్థిపై కుక్కల దాడి

» తలుపునూరు గ్రామంలో ఘటన


కుక్కల దాడిలో గాయపడిన శ్రీచరణ్

రేవల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాఠశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థిపై కుక్కలు దాడి చేశాయి. వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లయ్య కుమారుడు శ్రీచరణ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన శ్రీచరణ్ మూత్ర విసర్జన కోసం గేటు దాటి బయటకు వచ్చాడు. అక్కడే ఉన్న వీధి కుక్కలు అతడిపై దాడి చేసి కరిచాయి. ఉపాధ్యాయులు గమనించి బాలుడిని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు ఆసుపత్రికి చేరుకున్నారు. శ్రీ చరణ్‌ను మెరుగైన చికిత్స కోసం మహబూబ్ నగర్ ఆసుపత్రికి తీసుకెళ్తున్నట్లు తండ్రి మల్లయ్య తెలిపారు. బడిలో విద్యార్థులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రహరీ పూర్తిగా లేదని. కుక్కలు, పందులు నేరుగా వస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. ముందువైపు గేటు కూడా లేకపోవడంతో గ్రామస్థులు చందాలు వేసుకొని ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఏటీఎంలో నగదు దోపిడీకి యత్నం

- పోలీసులు రావడంతో పరారైన దొంగలు



బిజినేపల్లి బస్టాండ్‌లో దోపిడీ యత్నం జరిగిన ఏటీఎం

బిజినేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంలో ఏటీఎం చోరీకి యత్నించిన దొంగలు, పోలీసులు రావడంతో పరారయ్యారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న ఇండియా వన్ ఏటీఎంలోకి మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడు. అంతకు ముందే సీసీ కెమెరాల తీగలను కట్ చేశాడు. ఏటీఎంను తెరిచేందుకు యత్నిస్తుండగా సెక్యూరిటీ గార్డు కృష్ణయ్యకు అలర్ట్ అలారం రావడంతో అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు వెంటనే ఏటీఎం వద్దకు చేరుకోగా, వారి రాకను గమనించిన దుండగులు పరారయ్యారు. అనంతరం సీఐ కనకయ్య, ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తామని తెలిపారు. సెక్యూరిటీ గార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా


రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడిన ట్రాక్టర్

పెబ్బేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మునిసిపాలిటీలోని కొత్తకోట బైపాస్ సమీపంలో మంగళవారం ఓ ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఏటిగడ్డ శాగాపూర్ గ్రామానికి చెందిన కోరె రాజు రీచ్ వద్ద ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేసుకొని పెబ్బేరుకు వస్తుండగా ఈ సంఘటన జరిగింది. అదుపు తప్పిన ట్రాక్టర్ రోడ్డు కిందికి జారి పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

గృహహింస కేసులో వ్యక్తికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గృహహింస కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలానికి చెందిన కావలి శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడిపై 2021లో గృహహింస కేసు నమోదయ్యింది. దర్యాప్తు చేపట్టిన మహిళా పోలీస్‌స్టేషన్ అధికారులు చార్జిషీట్ దాఖలు చేశారు. శ్రీనివాస్‌పై నేరం రుజువు కావడంతో అతడికి ఏడాది జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం మహబూబ్‌నగర్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి మమతారెడ్డి తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణకు పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన విచారణ అధికారి ఎస్‌ఐ సుజాత, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏపీపీ ఎన్ బాబురావు, సీడీవో హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్ ముజీబ్‌లను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

» మార్నింగ్ వాక్ చేస్తుండగా ఢీకొన్న వాహనం

» గుంతకోడూరు, యంగంపల్లి మధ్య ప్రమాదం


లింగంగౌడ్ (ఫైల్)

తాడూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మార్నింగ్ వాక్ చేస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని గుంతకోడూరు గ్రామ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన లింగంగౌడ్ (46) మంగళవారం తెల్లవారుజామున మ్యార్నింగ్ వాక్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై లింగంగౌడ్ భార్య పావని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాడూరు హెడ్‌కానిస్టేబుల్ సురేశ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నర్వ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం, అంకెన్‌పల్లికి చెందిన లక్ష్మన్న (53) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మన్న తన అత్తగారి ఊరైన నర్వ మండలంలోని గుడిగండ్లకు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. పాతర్‌చెడ్ నుంచి జక్లేర్‌కు వెళ్లే దారిలో రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. అదే దారిలో వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు స మాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మన్న మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

పాఠశాలల్లో గ్రంథాలయాలు

» గద్వాల జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఏర్పాటు

» విద్యార్థులకోసం వివిధ రకాల పుస్తకాలు

» పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడమే లక్ష్యం


గ్రంథాలయానికి వచ్చిన కథల పుస్తకాలతో తుపత్రాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు (ఫైల్)

అయిజ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పఠనాసక్తిని, నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా రంగు రంగు బొమ్మలతో కూడినవి, నైతిక విలువలను పెంపొందించేవి, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, నీతి కథల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసేందుకు 2023లోనే అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతీ సంవత్సరం వివిధ రకాల పుస్తకాలను అందిస్తున్నారు. అలాగే ఈ విద్యాసంవత్సరంలోనూ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అధికారులు సమగ్ర శిక్ష ద్వారా పుస్తకాలను పంపిణీ చేసింది. అవి జిల్లా కేంద్రాలకు, అక్కడి నుంచి ఎంఆర్సీలకు, వాటి నుంచి బడులకు చేరాయి.



ప్రాథమిక పాఠశాలలకు పంపిణీ చేసిన నీతి కథల పుస్తకాలు

జిల్లాలో 71,520 మంది విద్యార్థులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో 472 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 71,520 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆయా పాఠశాలలకు రూమ్ టూ రీడ్, నేషనల్ బుక్ ట్రస్ట్ సంస్థల ఆధ్వర్యంలో పాఠశాలకు ర్యాక్‌లను, ప్రతీ పాఠశాలకు 115 పుస్తకాలను అందించాయి. అందులో తోడేలు-మేకపిల్ల, మోసకారి నక్క, తెలివి తక్కువ మేక, పులితోలు కప్పిన గాడిద, సమయ స్ఫూర్తి, స్వార్థపరులైన స్నేహితులు తదితర పుస్తకాలున్నాయి. ఇలాంటి పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థుల్లో సమయ స్ఫూర్తి, నైతిక విలువలు, నీతి, నిజాయితీలను పెంపొందుతాయి. గ్రంథాలయాల్లో విద్యార్థులు పుస్తకాలను చదువుకునేందుకు ప్రతీ రోజు సాయంత్రం ప్రత్యేకంగా ఒక పీరియడ్‌ను కేటాయించారు. ఆ సమయంలో పుస్తకాలను చదివేలా ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.

పఠనా నైపుణ్యం పెరుగుతుంది



విద్యార్థులు బాల సాహిత్య పుస్తకాలను చదువుకునేందుకు ప్రతీ రోజు సాయంత్రం ఒక పీరియడ్‌ను కేటాయించాం. చదువుతున్నప్పుడు వచ్చే సందేహాలను నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు కూడా అందుబాటులో ఉంటున్నారు. పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో పఠాన నైపుణ్యం, విజ్ఞానం పెంపొందుతుంది. సమాజంలో మంచి, చెడులను తెలుసుకునే అవకాశం ఉంటుంది.

- రవీంద్ర, ప్రధానోపాధ్యాయుడు, తుపతురాల ప్రాథమికోన్నత పాఠశాల

సృజనాత్మకత పెంపొందుతుంది



గ్రంథాలయాల ఏర్పాటుతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుంది. నీతి, నిజాయితీ, నైతిక విలువలు తెలుస్తాయి. స్ఫూర్తిదాయకమైన పుస్తకాలు చదవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగి సొంతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు చేరాయి. అక్కడ ఏర్పాటు చేసిన గ్రంథాలయాల్లో వాటిని అందుబాటులో ఉంచారు.

- మహ్మద్ అబ్దుల్ ఘనీ, జిల్లా విద్యాధికారి

మరో మూడు సహకార శిక్షణ కేంద్రాలు మంజూరు

» ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మరో మూడు సహకార శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎం. రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ సమర్పించిన ప్రతిపాదనల మేరకు నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో శిక్షణ కేంద్రాలు మంజూరు చేసినట్లు ఈ మేరకు జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటివరకు హైదరాబాద్, వరంగల్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఇక నుంచి మరో మూడు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సహకార యూనియన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదలచేశారు. రాష్ట్రంలో కొత్త సహకార శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

20న ఒలింపిక్ టార్చ్ ర్యాలీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న మహబూబ్‌నగర్ ఒలింపిక్ టార్చ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌పి వెంకటేశ్, కురుమూర్తిగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం

» దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి


దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి

చారకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని సిరసనగండ్ల పంచాయతీలోని అక్రమ ఇళ్ల నిర్మాణాలను తొలగిస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. సీతారామచంద్ర స్వామి దేవాలయం ఉన్న అయోధ్యనగర్ (గుట్ట) వద్ద తహసీల్దార్ అద్దంకి సునీత అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆలయ భూమిలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారితో చర్చించారు. ఈ సందర్భంగా మదనేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 327, 328 సర్వే నెంబర్లలోని ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మించిన 34 ఇళ్లను హైకోర్టు ఉత్వర్వుల ప్రకారం ఈ నెల 19న తొలగిస్తామని తెలిపారు. ఈ విషయంపై వారికి గతంలోనే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. గడువులోగా స్వచ్ఛందంగా ఇళ్లను ఖాళీ చేసి, అధికారులకు సహకరించాలని సూచించారు.

తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, ఇప్పటికిప్పుడు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లాలంటే ఎక్కడికెళ్లాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్లను తొలగించొద్దని, ప్రత్యామ్నాయం చూసుకొనేంత వరకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఈవో స్వర్గం అంజనేయులు, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ శంషుద్దీన్, ఈవోలు ప్రసాద్, కవిత, ఎంఆర్‌ఐ భరత్‌గౌడ్, సర్వేయర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

» తీలేరు గ్రామంలో భక్తుల సందడి

మరికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మరికల్ మండలంలోని తీలేరులో మంగళవారం ఎల్లమ్మ దేవత బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సం ఖ్యలో తరలివచ్చారు. ఉదయం భక్తులు డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ అమ్మవారికి జల్దిబిందె సేవ నిర్వహించారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. వేద పండితులు శ్రీనివాస్‌శర్మ, నీలకంఠ స్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్ శ్రీమతి రేవతమ్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు, ముంబై, పూణే, గోవా, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పట్టుచీర, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులపై అర్చకులు అమ్మవారి బండారు చల్లారు. సాయంత్రం ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాల తో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ ఎల్లయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా బోనాల ఊరేగింపు


సింగారం గ్రామంలో పోశమ్మ బోనాలతో మహిళలు

నర్వ/మక్తల్ రూరల్/నారాయణపేట రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా నర్వ మండలంలోని లంకాల, జక్కన్నపల్లి, లక్కర్‌దొడ్డి గ్రామాల్లో పోలమ్మ దేవత బోనాల పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వేళలో మహిళలంతా బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. డప్పు వాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది.

అదేవిధంగా, మక్తల్ మండలం అనుగొండ, గొలపల్లి, మంథన్‌గోడ్, భూత్పూర్, కాట్రేవ్‌పల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవత పోలమ్మ బోనాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పేట మండలం సింగారం గ్రామంలో మంగళవారం పోశమ్మ జాతరను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.


జక్కన్నపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న పోలమ్మ బోనాలు


అనుగొండలో పోలమ్మ బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వృద్ధురాలిని ఆదుకున్న పోలీసులు

» భర్తను పిలిపించి అప్పగింత

» వనపర్తిలోని ఇంటికి తరలింపు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కన్న కొడుకే నిర్దాక్షిణ్యంగా బస్టాండ్‌లో వదిలి వెళ్లిన వృద్ధురాలిని పోలీసులు ఆదుకున్నారు. బాధితురాలు, ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా కేంద్రంలోని, పీర్ల గుట్ట కాలనీకి చెందిన పార్వతమ్మ, రామకృష్ణ దంపతులకు ఇద్దరు కుమారులు భాస్కర్, రాములు ఉన్నారు. వారు ఇంటిని అమ్మాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. అందుకు వారు అంగీకరించకపోవడంతో వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలో పెద్ద కొడుకు భాస్కర్ ఈ నెల 14న తల్లి పార్వతమ్మను హైదరాబాద్‌లో వైద్య చేయిస్తానని నమ్మబలికి వనపర్తి నుంచి ఆత్మకూరు బస్టాండ్‌కు తీసుకొచ్చాడు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఉంటాయని నమ్మించి ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉంటూ, భిక్షాటన చేసి ఆకలి తీర్చుకుంటోంది. ఈ విషయంపై దినపత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో స్పందించిన ఎస్పీ ఆత్మకూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు వనపర్తి నుంచి భర్త రామకృష్ణను పిలిపించి ఆమెను అప్పగించారు. వారి వద్ద ఆధార్ కార్డులు లేకపోవడంతో వనపర్తిలోని వారి నివాసానికి చేర్చారు. ఆధార్ వివరాలు లభించిన తర్వాత ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తామని పోలీసులు తెలిపారు.

రూ.443 కోట్ల డిపాజిట్లు

» రైతులకు రూ.468కోట్ల రుణాలు అందజేత

» డీసీసీబీ చైర్మన్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి

పాలమూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో మార్చి 31 నాటికి డిపాజిట్లు రూ.443 కోట్లకు చేరుకున్నాయి. రూ.685 కోట్ల స్వల్పకాలిక రుణాలు, దీర్ఘకాలిక, వ్యవసాయేతర రుణాల ద్వారా వివిధ ప్రయోజనాలకు రైతులు, వినియోగదారుల ప్రయోజనాలకు రూ. 468కోట్ల రుణాలు అందజేశామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. రుణాలు వసూళ్లలో ప్రగతిని కనబరిచినట్లు తెలిపారు. ఆర్‌బీఐ నుంచి సిక్‌బ్యాంక్ స్టేటస్ తొలగిపోయేలా ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. అర్‌బీఐ అనుమతితో తొందరలోనే బ్యాంకు వినియోగదారులందరికీ యూపీఐ సేవలు నూతన బ్రాంచ్ సేవలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చి 31, 2026 నాటికి రూ.2200కోట్ల టర్నోవర్ బిజినెస్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సభలో ఉపాధ్యక్షుడు కోరమోని వెంకటయ్య, సీఈవో ఎ.జ్యోతిరాణి, డైరెక్టర్లు, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షుడు, వివిధ సంఘాల అధ్యక్షులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మంత్రి తుమ్మలను సన్మానించిన హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తొలకరి ప్రారంభంలోనే రైతు భరోసా సకాలంలో అందించినందుకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు అభినందలు తెలుపుతూ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలి హర్షవర్ధన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేరుశనగ పండించే రైతులు అధికంగా ఉన్నందున వారికి సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందించాలని మంత్రిని కోరారు.

నేడు షా అబ్దుల్ రహమాన్ గంధోత్సవం

కోయిలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కోయిలకొండ షా అబ్దుల్ రహమాన్ వడెన్న దర్గా గంధోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు సయ్యద్ జలాలోద్దీన్ శమీం మంగళవారం తెలిపారు. బుధవారం సాయంత్రం ఊరేగింపుగా గంధం దర్గావరకు తీసుకొచ్చి ప్రత్యేక ప్రార్థనల అనంతరం దర్గా వద్ద ఖవాలి, అన్నదానం ఉంటుందని తెలిపారు.

చోరీకి గురైన ట్రాక్టర్ శంషాబాద్‌లో లభ్యం

కోయిలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదీపూర్‌లో ఆదివారం చోరీకి గురైన ట్రాక్టర్, ట్రాలీ మంగళవారం శంషాబాద్‌లోని బ్రిడ్జి కింద వదిలివెళ్లినట్లు బాధితుడు మైపాల్‌గౌడ్ తెలిపారు. స్థానిక పోలీసులతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా ట్రాక్టర్ ఆచూకి కోసం వెతకగా శంషాబాద్ వద్ద దొరికినట్లు తెలిపారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

హన్వాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో వసూలు చేస్తున్న ఫీజుల దోడిడీని అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండ లింగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హన్వాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వసతులు లేకున్నా ప్రైవేట్ పాఠశాలలను నడుపుతున్నారని ఆరోపించారు. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు ఇష్టానుసారంగా నడుపుతున్నారని, స్కూల్ డ్రెస్‌లు కూడా ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముతున్నారని ఇలాంటి వాటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు జూక్యనాయక్, చెన్నప్ప, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

దాతల ఔదార్యం

మూసాపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ నాయకుడు పటేల్ నరసింహారెడ్డి సొంత డబ్బుతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేయగా, నందిపేటలో దేవరకద్ర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సూదిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళీధర్‌గౌడ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఖాదర్, ప్రవీన్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

నవాబ్‌పేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచూర్, పోమాల గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ సువర్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో 43 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

నవాబ్‌పేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీని పటిష్ఠం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రారంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా రమేష్ యాదవ్, రజితశ్రీనివాస్, విఠల్, ప్రధాన కార్యదర్శులుగా గణేష్ చారి, మల్లేష్ యాదవ్, కార్యదర్శులుగా రాఘవేంద్ర చారి, వరలక్ష్మీ, చిన్నయ్య, కోశాధికారిగా రాఘవేందర్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, నరేందర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలపై అవగాహన

భూత్పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భట్టుపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందిరమ్మ నిర్మాణం విధానం యాప్ ద్వారా ఇంటి మార్కింగ్ (ముగ్గు పోసిన) దగ్గర నుంచి వివిధ దశల్లో బెస్‌మెంట్ లెవల్, లెంటల్ లెవల్, స్లాబ్ లెవల్, రూఫ్ లెవల్ వరకు యాప్‌లో క్యాప్చరింగ్ చేయు విధానం, పేమెంట్ చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, ఇళ్ల నిర్మాణ మేస్త్రీలకు నిర్మాణ దశలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీ వో ప్రభాకర్‌చారి, హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్, డిప్యూటీ ఈఈ పుష్పలత, ఏఈ రాంసమీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన సర్వీస్ రోడ్డు పనులు

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



వేముల స్టేజీ వద్ద కొనసాగుతున్న సర్వీస్ రోడ్డు పనులు

మూసాపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ప్రమాదకరమైన ప్రదేశాలను గుర్తించి, అక్కడ వంతెన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందుకోసం మొదటగా ఏడు నెలలుగా మండలంలోని వేముల స్టేజీ వద్ద రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు పనులు చేపట్టారు. కానీ నెలలు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూరు నుంచి అలంపూర్ వరకు 180 కిలో మీటర్ల 44వ జాతీయ రహదారి విస్తరించి ఉండగా, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి వనపర్తి జిల్లా కొత్తకోట వెస్టర్న్ ఆంధ్రా టోల్‌గేట్ పరిధిలో సుమారు 55 కిలో మీటర్లు ఉండగా.. ఇందులో 14 బ్లాక్ స్పాట్లను జాతీయ రహదారి అధికారులు గుర్తించారు. భూత్పూర్ మండలం శేరిపల్లి (బి), మూసాపేట మండలం జానంపేట, వేముల స్టేజీ, వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట, పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ వద్ద అండర్ గ్రౌండ్ వంతెనలకు టెండర్ల ప్రక్రియను చేపట్టారు. ఈ వంతెనలు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా అధికారులు సకాలంలో పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

బ్రిడ్జి స్థలం మార్పు చేయాలి..



జానంపేటలో రహదారి 104-305 వద్ద బ్రిడ్జి మంజూరు కాగా, అక్కడ కాకుండా ప్రజలకు సౌకర్యంగా ఉండే 104-120 పాయింట్ వద్ద బ్రిడ్జి నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఇందుకోసం సంబంధిత శాఖ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశాం.

- కృష్ణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలి..



వేముల స్టేజీ వద్ద బ్రిడ్జి నిర్మిస్తే అర కిలో మీటర్ల దూరంలో ఉండే మూసాపేట స్టేజీ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. హైవే అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టి, ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి.

- కావలి నారాయణ, మూసాపేట

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

» తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న యూనియన్ నాయకులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను జనరల్ ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ సునిత ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్య ఉద్యోగులు బదిలీలు, పదోన్నతుల వంటి అంశాల్లో నష్టపోతున్నారని, కొత్త నియామకాలు లేక ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏజెన్సీ పరిధిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది కూడా కనీస వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వీరందరి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు యూనియన్ ముందుంటుందన్నారు. వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ వేయాలని, ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ విధానాన్ని అమలు చేయాలని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల తరబడి ఎన్నో ఉద్యమాలు చేసి జీవోలు, హక్కులు సాధించుకోవడంలో ఏఐటీయూసీ ముందుంటుందని, సమస్యల సాధన కోసం ఉద్యోగులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునిల్, ఉమ్మడి జిల్లా యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్, యూనియన్ నాయకులు వెంకటేష్, కోటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, కిశోర్, రాంప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఏవో శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాల విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేసి, విద్యార్థుల చదువులు కొనసాగేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బెస్ట్ అవైలబుల్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ ఏవో శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు బడ్జెట్‌ను విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లలను పాఠశాలలకు రానివ్వడం లేదన్నారు. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపిక చేసిన పాఠశాలలు బ్రిలియంట్, కాకతీయ, డిల్లీ ఒలంపియాడ్, ఎన్.పి సుబ్బారెడ్డి, లిటిల్ ఏంగిల్స్ పాఠశాలలు ఉండగా, మొత్తం 709 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు మంజుల, నర్సిములు, రాజు, శివలీల, భాగ్యమ్మ, నాయకులు మోహన్, మాణిక్యం, రాజు, హనుమంతు, మనోహర్, పకీరప్ప పాల్గొన్నారు.

టాస్క్ రీజినల్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉద్యోగ లక్ష సాధనలో భాగంగా నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కలెక్టర్ సహకారంతో జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టాస్క్ రీజినల్ సెంటర్ స్టేట్ హెడ్ నవీన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రోగ్రామింగ్ స్కిల్స్, సీ-లాంగ్వేజ్, జావా ఫండ మెంటల్స్, హెచ్‌టీఎంఎల్ అండ్ సీఎస్ఎస్, పైథాన్ ప్రోగ్రామింగ్, అర్థమెటిక్ అండ్ రీజనింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు రైల్వేస్టేషన్ సమీపంలో గల టాస్క్ కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

డ్రైనేజీ పూడిక తీయించాలి

జడ్చర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని 16వ వార్డులో ఉన్న పాత డ్రైనేజీ పూడిక తీయించాలంటూ మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలతకు కాలనీవాసులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ పూర్తిగా నిండుకుపోయిందని, ప్రస్తుత వర్షాకాలంలో పూడిక తీయించాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో ప్రదీప్, రమేశ్, కుమార్ ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు

కోయిలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానుగుబండ తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ20 లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేష్ మంగళవారం తెలిపారు. దీంతో పాటు జమాల్‌పూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు కాగా త్వరలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆధ్వర్యంలో పనులు ప్రారంభించనునట్టుట్లు తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ

కోయిలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదీపూర్‌లో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

అంగన్‌వాడీల్లో అనుకరణతో బోధన



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న డీడబ్ల్యూవో జరీనాబేగం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుకరణ ద్వారా పిల్లలకు విద్యాబోధన చేస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి జరీనాబేగం అన్నారు. మంగళవారం పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అందులో భాగంగా అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వళన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మూడేళ్లపైబడిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. పిల్లలు కోరుకునే విధంగా ఆట బొమ్మలు, వస్తువులు, పాటలతో అనుకరణ ద్వారా విద్యాబోధన చేస్తున్నామని, అందరికీ ఒకేరంగా ఏకరూప దుస్తులు కూడా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రాధిక, సూపర్‌వైజర్ వలీమ్ సుల్తానా, మహిళా కాంగ్రెస్ నాయకురాలు శ్రీపూజిత, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



రాష్ట్ర మహా సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

పాలమూరు/చిన్నచింతకుంట జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహా సభలు ఈనెల 21 నుంచి నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మహా సభల పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో సుమారు 47 కోట్ల మంది కార్మిక వర్గం పనిచేస్తోందని, అందులో కేవలం 7 కోట్ల మంది కార్మికులకే సామాజిక భద్రత కనీస వేతనాలు అమలవుతున్నాయన్నారు. మిగిలిన 40 కోట్ల మంది కార్మిక వర్గానికి చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవిరిస్తూ నాలుగు కోడ్స్‌గా తీసుకొచ్చిందన్నారు. జిల్లా రైస్ అండ్ ఆయిల్‌మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దాసు, సహాయ కార్యదర్శులు శేఖర్, సతీష్, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు శ్రీను, బుజ్జి, కృష్ణయ్య, వెంకటయ్య, కురుమయ్య, వెంకటేష్, నవాజ్, నాగేష్ పాల్గొన్నారు. అదే విధంగా నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోళ్ల వెంకటన్న ఆధ్వర్యంలో చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించి, టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్‌గౌడ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీహరి, గ్రామ అధ్యక్షులు రాములు, మహేందర్, కమలాకర్, శ్రీను, నాగరాజు, గురు, వెంకటేష్, మాసన్న, మాడెన్న, అంజనేయులు, దేవుడు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి : డీఈవో



విద్యార్థులకు అక్షరాభాస్యం చేస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహమ్మదాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థుల సంఖ్య పెంచాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గాధిర్యాల్ ప్రాథమికోన్నత పాఠశాల, కుచ్చమీదితండా, మహమ్మదాబాద్ కేజీబీవీ, గండీడ్ కేజీబీవీలను తనిఖీ చేశారు. గాధిర్యాల్‌లో విద్యార్థులకు అక్షరాభాస్యం చేయించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. గాధిర్యాల్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంపై ఉపాధ్యాయులను అభినందించారు. కుచ్చమీదితండా పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. మహమ్మదాబాద్ కేజీబీవీలో బోధన తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌వో, సీఆర్టీ, పీజీ సీఆర్టీలతో సమావేశం నిర్వహించారు. ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రతీ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకోవాలి : ఎస్పీ

జడ్చర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతీ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకోవాలని ఎస్పీ జానకి సూచించారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు, కేసుల నమోదు, విచారణ పురోగతి, సెక్యూరిటీ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుబాటులో ఉండాలని జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో కమలాకర్‌కు సూచించారు. ప్రతీ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకోవడంతో పాటు పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తక్షణ స్పందన, మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 44వ నెంబరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల నమోదు, పెండింగ్ కేసుల వివరాలను ఎస్పీ జడ్చర్ల సీఐ కమలాకర్ వివరించారు.

సమష్టి కృషితోనే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌యాదవ్

మిడ్జిల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే విజయం సాధ్యమని ఆ పార్టీ టీపీసీసీ అబ్జర్వర్లు సాంబయ్య, భాస్కర్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టీఆర్ఆర్ కన్వెన్షన్ హల్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు కాంగ్రెస్ జెండా ఎగరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయితో పాటు మండల స్థాయిలో కమిటీలను పూర్తి చేసుకోవాలన్నారు. దీంతో పాటు బ్లాక్ కాంగ్రెస్ కమిటీలను పూర్తి చేయాలని వివరించారు. కార్యకర్తల్లో ఏమైన చిన్నచిన్న వర్గ విబేధాలుంటే పక్కన పెట్టి పార్టీ కోసం, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. టీపీసీసీ రాష్ట్ర నాయకుడు రబ్బానీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గౌస్, నాయకులు వెంకటయ్య, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, ఉస్మాన్, పర్వతాలు, రాముగౌడ్, శంకర్, జహంగీర్, హరిగౌడ్, శివ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల మండలం కొండేడు గ్రామంలో మంగళవారం రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం పెద్దఆదిరాల, నసరుల్లాబాద్ గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పోలెపల్లిలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు.

● మిడ్జిల్ : మండల కేంద్రానికి చెందిన ఓ దినపత్రిక రిపోర్టర్ రాఘవేందర్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంగళవారం ఇంటికెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గౌస్, పాత్రికేయులు రాజేష్, నిస్సార్, శ్రీనివాసులు, అశోక్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్, కమిషనర్లు

జడ్చర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి వివరించారు. జడ్చర్ల మునిసిపాలిటీ 13వ వార్డులో కౌన్సిలర్ నందకిశోర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన వందరోజుల ప్రణాళికలో ఒక మార్పు-అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బట్టతో, జనపనారతో తయారు చేసిన బస్తాలు వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాయిరాం, కోనేటి నర్సిములు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బాలానగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని గీతాంజలి పాఠశాలకు సంబంధించిన పుస్తకాలను అక్రమంగా అమ్ముతున్న షాప్ వద్ద ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని పాఠశాల పేర్లు డీఈవో అధికారికంగా ప్రకటన చేయాలని, ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు వసతులు, సౌకర్యాలు, నిబంధనలకు లోబడి ఫీజుల వసూలు చేయాలన్నారు. పుస్తకాలు, బెల్టులు, బ్యాడ్జీలు అధిక ధరలకు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నగర కార్యదర్శి సబావాత్ సాయికుమార్, బాల్‌కోటి, రమేష్, రక్షిత్, బాలు, చంద్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జడ్చర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దుష్యంత్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. జడ్చర్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జడ్చర్ల మునిసిపాలిటీ, మండలంలోని 43 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మినాజ్, ఖయ్యూం, ఎర్ర ఆనంద్, లక్ష్మమ్మ, స్వప్న పాల్గొన్నారు.